# శుష్కప్రియులు

వే. వి. శర్మ

"శుష్కప్రియాలు, శూన్యహస్తాలు" అని లోకోక్తి. తియ్యనిమాటలు చెప్పి క్రియాశూన్యము చేసెడివారు శూన్యహస్తాలు. శుష్కప్రియులు కానివారు లేరు. ఆమాటంటే కోపము రానివారూ లేరు. శబ్దముల సంకుచితార్థమే యిందుకు కారణము. 'శూన్యహస్తాల' సహవాస దోషమువలన 'శుష్కప్రియాల'కు నింద వాటిల్లినది.

క్రియారూపము చెందని సంభాషణములు శుష్కోక్తు లనవచ్చును. వినోదార్థము సలుపు వింత వాదములు, కాలయాపనమునకై చెప్పుకొనెడి కబుర్లు 'శుష్కప్రియా' లనిపించుకొనును. ఇందు గర్హించుకొనతగిన దేమున్నది? మన మనేకవిషయముల గూర్చి చర్చించుదుము. ఈ వాద ప్రతివాదము లన్నియు క్రియారూపము దాల్చుట దుర్లభము; అసంభవము. పగలంతయు పాటుపడి సాయంకాల మొకగంటసేపు విహారార్థము క్లబ్బుకుపోయి చెప్పుకొను కబుర్లు క్రియాశూన్యము లని యాక్షేపించుటయూ, నిరర్థకములని పరిహసించుటయు మానవస్వభావమును మరచుటయే.

క్లబ్బుకబుర్లు నిరర్థకము లనుట పొరపాటు. శ్రుత పాండిత్యమువలన గలుగు జ్ఞాన మపారము; వివిధ విషయోపేతము. గురు శుశ్రూషచేసి యార్జించిన విద్య సాంప్రదాయ సిద్ధము కావచ్చును; కూలంకషము కావచ్చును. కాని అట్టి విద్యకు వన్నెతెచ్చుటకును, జనరంజకమై లౌకికమున కుపయోగించుటకు శ్రుతపాండిత్యము కూడ అవసరము.

ఇంతియు కాక అనేక క్లిష్టసమస్యలు క్లబ్బులలో చర్చింపబడును; పరిష్కరింపబడును. ఇట్టి చర్చలలో జరిగెడి తర్జనభర్జనలు మామూలు సభలలో జరుగనేరవని యనుభవమువలన చెప్పగలను. ఇందుకు తార్కాణముగ నొక యుదాహరణము నిచ్చెదను.

మా రాజమహేంద్రవర హిందూ సమాజము సుప్రసిద్ధమైన సంస్థ. శ్రీయుత న్యాపతి సుబ్బారావు పంతులుగారి భూరివిరాళముతోను, ఇతరదాతల సహాయముతోను మా సమాజమునకు దివ్యమైన స్వంతభవన మేర్పడినది. పంతులుగారి నాయకత్వమున మా సమాజములో హిందూసంఘ పురోవృద్ధికి కావలసిన పరిస్థితు లేర్పడినవి. వ్యాయామక్రీడలు, మతోపన్యాసములు, కాలక్షేపములు, భగవద్గీతా పఠనము మొదలగు మత సాంఘిక విషయములను గూర్చి వ్యాసంగము జరుగుచుండును. ఎన్ని యుపన్యాసములు విన్నను తదనంతరము సమాజావరణములో నున్న గంగరావి చెట్టుక్రింద మా 'శుష్కప్రియ బృందము' తర్కించిన గాని యే విషయమైనను సుబోధము కాదు.

'శుష్కప్రియ బృందము' (Huskers' Club) ఈమాట నూతనముగ ఆంగ్లేయ నిఘంటువులో చేరవలసియున్నది) అను పేరు మేము పెట్టుకొన్నది కాదు. కూటికి గుడ్డకు గాని వృథా ప్రసంగములతో, కాలహరణము చేయుచుండుటను భ్రమచేత మాలో చేరనివా రిచ్చిన బిరుదము. సార్థకమగుటచేత మా కందుకు కోపములేదు.

మా బృందము కలగూరగంపవంటిది. ఇందు వక్తలు, పండితులు, కవులు, గాయకులు, దేశనాయకులు, దేశసేవకులు, కార్యశూరులు, వాక్శూరులు, సంఘసంస్కర్తలు, సనాతన ధర్మపరాయణులు, భోజన ప్రియులు, అన్నదాతలు—వీరు వారననేల, నిరశనవ్రత పరాయణులుదప్ప మిగిలిన విద్యలలో ప్రవీణులున్నారు. మేము చర్చించని విషయముండదు. పకోడీ పాకవిశేషములు మొదలుకొని భగవద్గీతా రహస్య విశేషములవరకు మా చర్చలోనికి రాకమానవు. విశేషించి మతసాంఘిక విషయములు మా సొమ్ము. డికెన్సువంటి మహాకవియే మాలో నుండెనేని మాచర్చ లిదివరకే రచ్చకెక్కియుం

డేవి. మచ్చునకై యొక సాయంకాలము తిరువాంకూరు ఫర్మానాను గూర్చి మేము సలిపిన చర్చ నిందు సంక్షేపముగ దెలిపెదను. దీనినిబట్టి మే మే విషయమునైనను ఎంత నిపుణతతో కడతేర్చగలమో భారతీ పాఠకులకు తెలియగలదు.

అవర్ణుల దేవాలయ ప్రవేశవిషయములో తిరువాంకూరు మహారాజావారి ఫర్మానావలన దేశమంతయు అట్టుడికినట్లుడుకునని తలంచితిని. ఆసేతుహిమాచలము సనాతన ధర్మపరాయణులు సభలుచేసి మహారాజావారి చర్యను ఖండించెదరని యనుకొంటిని. కాని పూర్వాచార పరాయణులు కిక్కురుమనలేదు. మఠాధిపతుల గర్జనములు మాటుమణిగినవి. శారదా చట్టమునకు వ్యతిరేకముగ కంకణముకట్టుకొని దెబ్బలాడిన వాక్కూరులెవరును నోరెత్తలేదు. గురువయ్యూరు సత్యాగ్రహ సమయమున జామొరినుకు కుడిభుజమై కథనడిపించిన తాతా సూర్యనారాయణ రావుగారు కూడ మిన్నకుండిరి. భారత ధర్మమహామండలి పట్టుదల వదలి పలుకలేదు. మీదుమిక్కిలి ఆచార్య సుందరరామయ్యవంటి శిష్టాచార పరాయణులు తిరువాంకూరు ఫర్మానాను సమర్థించిరి. దేశమంతటను గాంధీ శిష్యులు చంకలుకొట్టుచు సంతోషించుట యాశ్చర్యమా?

ఇట్టి స్థితిలో నాకేమిచేయుటకు పాలుపోక మా నాయకులగు సుబ్బారావు పంతులుగారిని చేరి "ఏమండీ పంతులుగారూ! తిరువాన్కూరు ఫర్మానా విషయమై మన హిందూసమాజముతరపున సభచేసి యభిప్రాయమును తెలుపుట మన కర్తవ్యముకాదా?" యని ప్రశ్నించితిని. అందుకు వారొక చిరునవ్వు నవ్వి మిన్నకుండిరి. పంతులుగారి మందహాసము వారి చిరపరిచితులకుగాని బోధపడదు. వా రదివరకే మహారాజావారి నభినందించినారు. హిందూ సమాజము తరపున ఇదమిత్థమని అభిప్రాయము వెల్లడించుటలో కొన్ని చిక్కు లుండవచ్చునని వారూహించినట్లు నేను గ్రహించితిని.

ఇట్టి క్లిష్టపరిస్థితులలో మా శుష్కప్రియ బృందమైనను ఈ విషయము చర్చించవలెనని నిశ్చయించియొక నాటి సాయంకాలము తర్జనభర్జనకు గడంగితిమి.

ఆనాడు పంతులుగారు కార్యాంతరమువలన సమాజమునకు రాలేదు. నాటి సభలో జరిగిన వాద ప్రతివాదములు టూకీగా నిందు తెలిపెదను.

### సభా ప్రారంభము

"నేడు సుబ్బారావు పంతులుగారు రాలేదు గనుక యీ సభకు నేనే ప్రెసిడెంటు"నని అతి వినయముతో ఆంధ్రబ్రాహ్మణ మహామండలి యధ్యక్షుడగు మా ప్రెసిడెంటు రామారావు కుర్చీలో కూర్చుండెను.

నారాయణమూర్తి:— ఏమండీ రాచకొండ సుబ్బారావుగారూ! మనకర్మము! ఈ సభకు కూడా రామారావేనా ప్రెసిడెంటు? నిన్న శ్రద్ధానందఘాటులో జరిగిన సభకు ప్రెసిడెంటై తిరువాన్కూరు మహారాజావారిని అభినందించుమ పురజనుల కృతజ్ఞతను తెలపడమా? ఈవేళ యిక్కడ అధ్యక్షతవహించి దానినే ఖండించడమా? ఏమివింతలండీ! బాగు! బాగు! మీరంతా యేమైనారు? సమాజానికి ట్రస్టీలు. భగవద్గీతా రహస్యముల నుపదేశము పొందినవారు. శక్తికొలది సనాతన ధర్మము ననుష్ఠించుచున్నవారు. మీ రుండకూడదా ప్రెసిడెంటుగా? మహా పండితులు కవులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగా రుండకూడదా? వేదాధ్యయనము సాంతముగ జేసిన సోమనాథంగారు తగరా? ఇందరుండగా నావలె సాగ్నిహోత్రి రామారావా మనకు దొరికాడు?

సోమనాథం:— వేదశాస్త్రములు చదివినవారుగాని యీ సభకు అధ్యక్షులుగా వుండకూడదు. విశేషించి దేవాలయప్రవేశ నిబంధనలు ఆగమశాస్త్రములు విధించును గనుక ఆగమశాస్త్రవేత్తలుగాని తదితరులు ఈ సభకు అధ్యక్షులుగా నుండతగరు. నాకు కృష్ణ యజుర్వేదము అశీతిద్వయము నట్టులేకుండా వచ్చును. వేదాలకు ఆగమాలకు చాలా దగ్గిర.

కృష్ణమూర్తి:— మీకేనా? కృష్ణమూర్తిశాస్త్రి గారికి రావు ఆగమాలు? ఆయన ప్రెసిడెంటు గాతగడా?

శ్రీ. కృ. శాస్త్రి:— బాబోయి! నన్ని గొడవలోకి లాగకండి. ఇప్పడున్న వే వదుల్చుకోలేకున్నా

న్నాను. స్మార్తము, శ్రౌతము చెప్పకొన్నట్లు నా గ్రంధములలో వ్రాసినందుకే నేను తద్దిన బ్రాహ్మణార్థాలకు తప్ప కవిత్వము విమర్శనమునకు తగనని యాక్షేపించారు. ఇప్పుడు ఆగమాలు వచ్చునంటే తంబళపనికే గాని తద్దిన బ్రాహ్మణార్థాలకు గూడ కరకాక్యపడుతుంది.

శేషగిరిరావు:— మన లోకల్ జామెురిను (సీతారామశాస్త్రి) ఏమంటాడు?

సీ. రా. శాస్త్రి:— ఆగమాల విషయము మీకేమి తెలుసునయ్యా? మా తండ్రిగారు కట్టించిన రెండు దేవాలయాలు నడిపించే భారం నెత్తిమీద వేసుకొని యీదుచున్న నన్నడగండి! దేవాలయ ప్రవేశము అవర్ణులకు నిషేధము. ఆగమాలు వప్పవు. ఒక మహారాజు ఫర్మానా జారీచేసినంతమాత్రాన అది శాస్త్రీయము కాదు. జార్జి చక్రవర్తి శాసించినప్పటికి మా దేవాలయాలలోనికి అవర్ణులను రానీయను.

వెంకటచలం:— మా కోరుకొండ క్షేత్రమేనా యేమిటి తీసిపోయింది? ప్రస్తుతము ధర్మకర్తను గదా యని రామారావు ఉత్రట్లూగుతున్నాడేమొ. మేమూ రానీయము. ఏమిచేస్తాడో చూస్తాము.

గురుమూర్తి:— అవర్ణులను మీరు రానీయకపోతే మీ దేవాలయాల్లోకి సవర్ణులు కూడా రారు. శుచి శీలము ప్రధానము గాని జన్మ ముఖ్యము కాదు. నీలోను నాలోను ఉన్న దేవుడు అవర్ణులలో లేకపోలేదు. దేవాలయాల కొరకు ఆగమాలు పుట్టినవి కాని ఆగమాలకొరకు దేవాలయాలు పుట్టలేదు. ధర్మశాస్త్రములవలె ఆగమ శాస్త్రములు కూడా కాలోచితముగ మార్పు చెందవచ్చును.

చయనులు:— ఏమండీ సుబ్బారావు గారూ? శాస్త్రాలు మార్చవచ్చునంటే మీ రూరుకుంటారేమి?

సుబ్బారావు:— ఈ రోజుల్లో మనమాట వినేవారెవరయ్యా?

చయనులు:— వినకపోతే మాత్రం? మీవిధి మీరు నెరవేర్చుకోవద్దూ?

చి. ల. న.— దేనికైనా గుణము ప్రధానముగాని కులము ప్రధానముకాదు. సిరికంటె శీలము శ్రేష్ఠము. కులముకంటె గుణము శ్రేష్ఠము. కాబట్టి శుచి, శీలము, నిశ్చలమైనభక్తి కలవారేజాతివారైనను దేవాలయములకు వెళ్లుటకర్హులు. ఇవి లేనివారగ్రజాతివారైనను గుళ్లలో మెుక్కుట నిష్ప్రయోజనము. ఆగమాలకు ధర్మశాస్త్రాలకు వేదములే మూలాధారములు. వేదము సనాతన ధర్మమును శాసించును. శాస్త్రములు యుగధర్మములను విధించును. యుగధర్మములు కాలానుగుణముగ మార్చవచ్చును.

సోమనాథం:— ఈ సిద్ధాంతాలెవరుచేశారండీ?

విజయరామయ్య:— వేదాలు ముందు, తరువాతనే ధర్మశాస్త్రాలు, ఆగమాలు. వేదాలు అపౌరుషేయములు. శాస్త్రాలు పౌరుషేయములు. పౌరుషేయములు మారవచ్చును. ఈ సిద్ధాంతములు మన పండితులు కూడా వప్పుకున్నారు.

సోమనాథం:— ఎవరా 'మన?' 'తిమ్మన!' ఆ పండితులంతా మీబోటి హూణ విద్యాసంపర్కము గలవారే. శిష్టాచారపరాయణుల కా సిద్ధాంతాలు నచ్చవు. చతుర్వేదాలు, చతుర్వర్ణాలు, ధర్మశాస్త్రాలు, ఆగమాలు—ఇవన్నీ యేకకాలమున సృష్ట్యాదిని బ్రహ్మ సృజించాడు. ఋషులనోట మనకు లభించినవి. ఇవి యేవిన్నీ మార్చుటకు శాస్త్ర మెుప్పదు. ఇందుకు తిరుగు లేదు. మీకు దిక్కున్నచోట పోయి చెప్పకోండి.

వెంకటరావు:— భేష్! గట్టిగా చెప్పాడు. పిడివాదాలకు పిడిగుద్దుల వాదాలకు అప్పీలెక్కడ?

బంగారయ్య:— ప్రస్తుతము చర్చనీయాంశము వదిలిపెట్టి యితర గొడవల్లో పడ్డాము. అవర్ణుల దేవాలయ ప్రవేశము మన మంగీకరించడమా నిరోధించడమా, అను విషయ మిప్పుడు తేలాలి.

సీ. రా. శాస్త్రి:— ఆవిషయము తేల్చుటకు రామారావు ప్రెసిడెంటుగా పనికిరాడు. ఇతడేమి అవతారపురుషుడా? ఈరోజు వకవేషము రేపు మరొక వేషము వేసి యాడుటకు?

రామారావు:—ఏమోయి నా సెక్రెటరీ! వీరి సందేహాలను తీర్పుము.

సోమశేఖరరావు:—ముందు నీ సందేహాలు తీర్చుకో. తరువాత మా సందేహాల మాట ఆలోచింపవచ్చును.

రామారావు:—నాకు సందేహాలే లేవు. సందేహముంటే ప్రెసిడెంటుపదవిని అధిష్ఠింపను.

శర్మ (సెక్రెటరి):— మన ప్రెసిడెంటు నన్ను మాట్లాడమని యాజ్ఞాపించుటలో అర్థమున్నది. తన పదవి విషయము మీకు సందేహము కలిగినప్పుడు తన్ను తాను సమర్థించుకొనుట స్వోత్కర్ష గా నుండవచ్చును. నన్ను సమర్థించ మనుటలో అతని నమ్రత వెల్లడియగుచున్నది. ఈ సభ కతడు ప్రెసిడెంటుగా నుండతగునా లేదా యను సమస్యను గూర్చి నాకుతోచిన ధర్మసూక్ష్మము చెప్పుతాను వినండి. ప్రెసిడెంటనగా తటస్థుడు; కామధేనువువంటివాడు. సభ్యుల యాజ్ఞను నెరవేర్పుటయే అతనివిధి. నిన్న శ్రద్ధానంద ఘాటుసభలో పురజనులు దేవాలయ ప్రవేశమున కానందించి తమ యంగీకారమును దెలిపిరి. గాంధీశిష్యుడగుటచేత రామారావు నిన్నటిసభకు ప్రెసిడెంటై యా తీర్మానమును పంపవలసిన తావులకు బంపెను. బ్రాహ్మణ మహామండలి యధ్యక్షుడగుటచేత నేటిసభకు కూడా అతడే ప్రెసిడెంటగుట ఉత్తమము. నేడు మనము దేవాలయ ప్రవేశమునకు వ్యతిరేకులమై తిరువానూరు ఫర్మానాను ఖండించుచు తీర్మానించినయెడల మనయాజ్ఞానుసారము ఆ తీర్మానమును యథోచితముగ ప్రెసిడెంటు కడతేర్చగలడు. ఇట్టిచర్యలో పరస్పర విరోధదోషములేదు. ఏలనంటే? ఏకవ్యక్తి అనేకరీతుల మసలుట యనుభవవేద్యము. శ్రీకృష్ణుడు భక్తులకు కల్పవృక్షము, గోపికలకు రసికుడు, గోగణముకు గానలోలుడు కాలేదా? గనుక దేవాలయప్రవేశసమస్యలో రామారావు పూర్వపక్ష సిద్ధాంతముల భారముల వెంటెని నిర్వహింపబూనుటలో ఆశ్చర్యములేదు. పరస్పరవిరోధమూ లేదు.

రామారావు—సభ్యులారా! ఇప్పుడు మీసందేహాలు తీరిపోయినవి గనుక అవర్ణుల దేవాలయ ప్రవేశమునుగూర్చి రాచకొండ సుబ్బారావుగారు మాట్లాడెదరని మనవి చేయుచున్నాను. సావధానముగ వినుడి.

సుబ్బారావు- "కలౌపంచ సహస్రాణి జాయతే వర్ణసంకరః" అని మనపూర్వులు వూసుపోక చెప్పలేదు. వారు నిజమైన సర్వజ్ఞులు. మనశర్మవంటి బూటకపుసర్వజ్ఞులుకారు. వోయ్! మరిన్ని—

శర్మ—నేను సర్వజ్ఞత్వము నారోపించుకొన్నట్లు భావించుటలో మన శుష్కప్రియుల తెలివితేటలు బయటపడుచున్నవి. 'సర్వజ్ఞుడ'ని నన్ను నీవు దెప్పినప్పుడు "సర్వజ్ఞ నామధేయము శర్వునకే. విశ్వనాథ శర్మకె! తగురా?" అని నేను ప్రశ్నించితిని. రెండవ చరణములోని మొదటి ఆశ్చర్యార్థకము, చివర ప్రశ్నార్థకము లోపింపజేసి బంగారయ్య భారతిలో యేమేమొ వ్రాసి తన కవితాచమత్కృతి చూపెను. అంతమాత్రము నేనూ తిరగేసికొట్టగలను. నిగర్వచూడామణినని గర్వించువాళ్లలో నేనొకడిని.

సోమయాజులు—సుబ్బారావుగారు! "నైనం ఛిందంతిశస్త్రాణి, నైనందహతి పావకః" అని భగవద్గీత. ఎవరేమిచేసినా మనసనాతనధర్మానికి చలనం లేదు.

సుబ్బారావు—అబ్బా! వుండవోయినీవు. ఆలాంటివి మనశాస్త్రాల్లో లక్షలున్నాయి—సత్యం వద; ధర్మంచర. ఏతావతా నేను చెప్పేదేమంటే? చెట్టుచచ్చేకాలానికి కుక్కమూతి పిందెలు పుడతాయని శాస్త్రం. శాస్త్రమెన్నటికి అబద్ధంకాదు. ముమ్మాటికిని నిశ్చయము.

ప్రకాశరావు శర్మతో:—మేష్టారూ! రేపు డిన్నరులో పి॥ పీ॥ లకు (పింకివంటలకు) పర్మిషనిస్తారా?

శర్మ:—రేపెవరింట్లో భోజనాలు?

ప్రకాశరావు:—చావలి సూర్యనారాయణగారింట్లో.

సర్వన్నశాస్త్రి, బు॥ సు॥ రావు:—రేపు పింకివంట లుండితీరాలి. రేపు పర్వదినం. గొడ్డుభోజనం పనికిరాదు.

శివరామకృష్ణయ్య:— ఉండండోయి! మీ కెప్పుడు భోజనాలగొడవే. ఇప్పుడు జరుగుచున్న చర్చ యేమిటి? మీగోలేమిటి? ఎప్పుడూ తిండిగొడవేనా?

ప్రకాశరావు:—నీకుమాత్రం తిండిగొడవ లేదా? తొట్టి స్నానాలు చేస్తున్నావా యేమిటి?

రామారావు:—ఎఃరక్కడ? భోజనాలను తృణీకరించు చున్నారు? నా భక్తులారా వినుడు! కోటి విద్యలూ కూటికొరకే. ‘అన్నంబ్రహ్మ’ ‘అన్నంననింద్యాత్’ అని వేదము ఘోషించుచున్నది. కావున అన్నమును అన్నదాతలను తిరస్కరించకూడను. ‘భుక్తికుదిరితేనే ముక్తి కుదురును’ ని మన పెద్దలు చెప్పినమాట సత్యము. వారిదారి త్రొక్కుటయే మనకు సర్వదా క్షేమకరము.

చా॥ సూ॥ నారాయణ, పాపయ్యశాస్త్రి, సర్వన్నశాస్త్రి, ప్రకాశరావు, శివరామకృష్ణయ్య, బు॥ సు॥ రావు ఐకకంఠ్యముగ:—ప్రెసిడెంటుకు జై! డిన్నర్లు నిరంతరము జరుగుచుండుగాక! ఇక లేవండి. ఇప్పటికే పొద్దయింది భోజనానికి.

రామారావు (నలుదిక్కులు పారచూచి):— I am a socialist. మీ సేవకుడను. మీ యిష్టానుసారము నడిచెదను. ఇప్పటికే కాలహరణ మయింది గనుక రేపు సాయంకాలము తిరిగి యీ విషయము చర్చించెదము. సభ నింతటితో సమాప్తిచేయుచున్నాను.

అధ్యక్షుని యాజ్ఞకు బద్ధులమై అందరము నాటి దినము ఇండ్లకు వెళ్లితిమి.

---


## బసవపురాణము వెల 2-8-0

గ్రంథకర్త:—పాల్కురికి సోమనాథకవి  పరిష్కర్త:—వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

౧ పండ్రెండవ శతాబ్దమున వెలసిన శైవమతప్రతిపాదకమగు ద్విపదకావ్యము, ఇందు శైవమతోద్ధారకు డగు బసవేశ్వరునియు, తత్పూర్వులు తత్సమకాలీనులు నగు శివభక్తులయు చరిత్రములను సరసముగను, పాఠకులు మనసుకరగి తన్మయులగునట్లుగను, కవి వర్ణించినాడు. గ్రంథమున మృదుమధురములగు జానుదెనుగు పలుకుల జాలువార్చి రచనమున ముద్దులుగురిపించినాడు. గ్రంథము భిన్నభిన్న మండలములకు జెందిన పెక్కు తాళపత్ర మాతృకలతో సరిచూచి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పుటలు) ఇందు గలదు. ఆకాలపు టపూర్వసారస్వత చారిత్రక విశేషముల లెక్కకు మిక్కిలిగ నందు పరిష్కర్త యేర్చికూర్చినారు. ఆధునిక కవికుమారుల కిది యత్యంతోపకారకము.

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల, నెం. ౭, తంబుసెట్టివీథి, మదరాసు